క్లుప్తంగా

శరవేగంగా పాఠశాల భవన నిర్మాణం



పులకుర్తిలో నిర్మిస్తున్న పాఠశాల భవనం

కోడుమూరు: నాడు–నేడు నిధుల కింద పులకుర్తి గ్రామానికి మంజూరైన హైస్కూల్ అదనపు గదుల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జిల్లాలోని అత్యధిక నిధులతో నిర్మాణమవుతున్న ఈ భవనం పులకుర్తి గ్రామానికే తలమానికంగా మారింది. రూ.2.07 కోట్ల నిధులతో పులకుర్తి హైస్కూల్ ఆవరణంలో ఈ భవనం నిర్మిస్తున్నారు. ఈ పాఠశాల భవనం పూర్తయితే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశముంది.

మేడే ఉత్సవాలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజి

గూడూరు: మే డే ఉత్సవాలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు కార్మికులకు సూచించారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అంజిబాబు మాట్లాడుతూ సమాజంలో కార్మికులకు, కర్షకులకు అండగా ఉండేది ఎర్ర జెండా ఒక్కటే అన్నారు. సంబరాలను కార్మికులు ఘనంగా జరుపుకోవాలన్నారు. సమావేశంలో డివిజన్ కార్యదర్శి మోహన్, కార్మికులు శాంతన్న, రంగన్న, శేషమ్మ, ఆదిలక్ష్మి, భారతి, ప్రేమమ్మ, అంగన్‌వాడీ నాయకురాలు సుజాత, సునంద పాల్గొన్నారు.

స్పందన నిర్వహించాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

సి.బెళగల్: సచివాలయాల్లో ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీఓ రాముడు సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన సంగాల గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయంలో అందుతున్న సేవలనను అక్కడికి వచ్చిన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమయ పాలన పాటించాలని, వలంటీర్లతో సమన్వయం చేసుకుని అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం మరమ్మత పనులను పరిశీలించి, గ్రామ పరిశుభ్రతపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు ముస్తక్, శ్రీనాథ్‌లకు సూచించారు. ఆయన వెంట సర్పంచ్ హనుమంతు ఉన్నారు.

'గోరుకల్లు'ను పరిశీలించిన సీఈ



గోరుకల్లు జలాశయాన్ని పరిశీలిస్తున్న సీఈ కబీర్‌బాషా

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు జలాశయాన్ని సీఈ కబీర్‌బాషా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కట్ట పటిష్టతను, జలాశయంలో నీటి నిల్వ, దిగువన గాలేరు గేట్లు, సోలార్‌కు కేటాయించిన నీటి తరలింపు పైపులైన్ పనులు, వాటర్ గ్రిడ్ ద్వారా గోరుకల్లు–ప్యాపిలికి పైపులైన్ పనులను పరిశీలించారు. అలాగే ఇటీవలన గోరుకల్లు కట్టకు చేపట్టిన నిర్వహణ పనులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వేసవిలో చేపట్టాల్సిన పనులపై ఈఈ సుభకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులపై సమీక్ష నిర్వహించారు. ప్రధాన కాల్వ నుంచి ఆయకట్టుకు వెళ్లే క్రమంలో అన్ని బ్లాక్‌ల వద్ద నీటి లీకేజీలు అరికట్టాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్ ప్రత్యేక పూజలు



స్వామివారి ప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడురు గ్రామ సమీపంలో ఉన్న బాలాజీ టెంపుల్‌ను గురువారం జాయింట్ కలెక్టర్ నిశాంతి సందర్శించారు. వెంకటేశ్వర స్వామిని ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జేసీకి ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. జేసీ వెంట తహసీల్దార్ శ్రీనివాసులు ఉన్నారు.

చిరుతిండి... ఉపాధి బండి

- పల్లెకు పాకిన వెస్టర్న్ కల్చర్
- ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల నిర్వహణలో యువత



ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో వంటకాలు చేస్తున్న దృశ్యం

కోడుమూరు: వెస్టర్న్ కల్చర్ పల్లెకు పాకింది. కాలం మారుతోంది... దానితోపాటు మన ఆహారపు అలవాట్లూ మారుతున్నాయి. ఫలితంగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు డిమాండ్ పెరిగిపోతోంది. పెద్దపెద్ద పట్టణాల్లో ఏర్పాటయ్యే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు ప్రస్తుతం పల్లెల్లోనూ మంచి ఆదరణ లభిస్తోంది. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వహణకు పెద్దగా పెట్టుబడి అవసరంలేదు.

దీంతో నిరుద్యోగ యువకులు ఫాస్ట్‌ఫుడ్ వంటకాల చేయడంలో శిక్షణ పొంది, సెంటర్లను ఉపాధి మార్గంగా ఎంచుకుంటున్నారు. కోడుమూరు, గూడురు, సి.బెళగల్ పట్టణాల్లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్ద సాయంత్రం పూట రద్దీ కనిపిస్తోంది. ఎగ్‌ఫ్రైడ్ రైస్, న్యూడిల్స్, గోబీ మంజూరీయా ఇలా ఎన్నో రకాల చిరుతిండ్లు నోరూరిస్తున్నాయి. మరోవైపు యువతకు చక్కటి ఉపాధి మార్గంగా ఉపయోగపడుతున్నాయి.

తక్కువ పెట్టుబడితో ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసుకున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వహణతో యువకులు ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదుగుతున్నారు.

ఉపాధికి ఆసరా



ఫాస్ట్‌ఫుడ్ వంటకాలు చేయడం నేర్చుకున్నప్పటి నుంచి గిట్టుబాటు కూలీలు అందుతున్నాయి. మొదట హోటల్లో సర్వర్‌గా పనిచేసేవాన్ని. నేపాలీల వద్ద చిరుతిండి వంటకాలు తయారు చేయడం నేర్చుకున్నప్పటి నుంచి రోజు కూలీ రూ.600 ఇస్తున్నారు. ఈ పని నేర్చుకోవడం వల్ల ఉపాధికి ఆసరా అవుతోంది.

– మధు, నిర్వాహకుడు

వ్యాపారం బాగా నడుస్తోంది



ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను మొదట నేపాలికి చెందిన వ్యక్తులతో నడిపించాను. వాళ్ల వద్ద పని నేర్చుకుని ప్రస్తుతం సొంతంగా నడుపుతున్నాను. నాలుగేళ్లుగా ఇదే వ్యాపారం సాగిస్తున్నాను. రోజూ రూ.1,500 సరుకులు తెచ్చుకుంటే, రూ.3000 వరకు వ్యాపారం నడుస్తుంది. ఖర్చులన్నీ పోనూ రూ.1,000 మిగులుతుంది.

– సుధాకర్, నిర్వాహకుడు

మోడల్ స్కూల్‌లో 29 శాతం పాస్



ప్రణతి, రంగస్వామి

సి.బెళగల్: స్థానిక మోడల్ స్కూల్‌ల్లో 29 శాతం ఫలితాలు నమోదయ్యాయని ప్రిన్సిపల్ వంశీమోహన్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో సీనియర్ ఇంటర్‌లో 76 మంది విద్యార్థులకు గానూ 22 మంది(29 శాతం) పాసయ్యారన్నారు. జూనియర్ ఇంటర్‌లో 81 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 15 మంది(18.5) పాసయ్యారన్నారు. సీనియర్ బైపీసీలో ప్రణతి 962 మార్కులు సాధించిందన్నారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఎంపీసీ విద్యార్థి రంగస్వామి 449 మార్కులు సాధించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ బలరాముడు తెలిపారు. ఇక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 26 మంది విద్యార్థినులకు గానూ 20 మంది పాసైనట్లు ఎస్‌ఓ జ్యోతి తెలిపారు.

- **గూడూరు రూరల్:** మండల పరిధిలోని జూలకల్ ఆదర్శ పాఠశాలలో సీనియర్ ఇంటర్‌లో 50 శాతం, జూనియర్ ఇంటర్‌లో 25 శాతం ఫలితాలు నమోదైనట్లు ప్రిన్సిపల్ దిల్షాద్ తెలిపారు. జూనియర్ ఎంపీసీలో మహేశ్వరి 417, బైపీసీలో బి.మహేశ్వరి 402, సీఈసీలో షేక్షావలి 435, సీనియర్ బైపీసీలో షైనాజ్ 915, ఎంపీసీలో సదియా బాను 896, సీఈసీలో రమణి 841 మార్కులు సాధించారన్నారు.

ఆదాయ వనరులను పెంచుకోవాలి

- డీఎల్‌పీఓ తిమ్మక్క



ఎస్‌డబ్ల్యూసీపీ షెడ్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ తిమ్మక్క

గూడూరు రూరల్: ఆదాయ వనరుల పెంపుపై గ్రామ పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని డీఎల్‌పీఓ తిమ్మక్క సూచించారు. కె.నాగలాపురంలోని ఎస్‌డబ్ల్యూసీపీ షెడ్‌ను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా వర్మీ కంపోస్టును తయారు చేసి రైతులకు విక్రయించి గ్రామ పంచాయతీకి ఆదాయాన్ని రాబట్టుకోవాలన్నారు. ప్రతి రోజు పారిశుధ్య కార్మికులు ఇంటింటికి తిరిగి పొడి, తడి చెత్తను సేకరించాలన్నారు. షెడ్డు చుట్టు పక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని, మొక్కలు నాటి పెంచాలన్నారు. పారిశుద్యం, తాగునీరు, వీధి దీపాల సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. ఆమె వెంట ఈఓఆర్‌డీ నాగమ్మ, పంచాయతీ కార్యదర్శి సౌందర్య ఉన్నారు.

గడప గడపకూ సంక్షేమం.. ప్రజల్లో సంతోషం



మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గడప గడపకూ సంక్షేమ పథకాలు అందుతుండటంతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం కర్నూలు మండలం నిడ్జూరు గ్రామంలో ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పార్టీలకు, కుల, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ ధర్మవరం వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ 2 నెహేమ్యా, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, మండల జేఏసీ కన్వీనర్ సత్యంరెడ్డి, గ్రామ సర్పంచ్ మాధవి, సచివాలయ కన్వీనర్లు తిరుపతిరెడ్డి, సంపత్‌కుమార్, ప్రసాద్, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్, ఎంపీడీఓ భాస్కర్ నాయుడు, ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి

- డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ రామచంద్రారెడ్డి



ఎల్‌కే తండాలో జరుగుతున్న పనుల వద్ద కూలీలతో మాట్లాడుతున్న పీడీ రామచంద్రారెడ్డి

గడివేముల: ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ రామచంద్రారెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని ఎల్‌కే తండా సమీపంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. కూలీల హాజరును తనిఖీ చేశారు. పీడీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రోజు వేతనం రూ.272 పడేవిధంగా పనులు చేయించాలన్నారు. మండల పరిధిలో 5 వేల మంది కూలీలు పనులకు వచ్చే విధంగా చూడాలన్నారు. ఎండలు తీవ్రమవుతుండటంతో పనుల వద్ద కూలీలకు సదుపాయాలు కల్పించాలని ఏపీఓ వెంకటరమణను ఆదేశించారు. గని గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు.

ఫీవర్ సర్వేను పూర్తి చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి రామగిడ్డయ్య

కల్లూరు: గ్రామాల్లో ఫీవర్ సర్వేను పూర్తి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రామగిడ్డయ్య ఆశా కార్యకర్తలు, వలంటీర్లకు సూచించారు. గురువారం ఆయన ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో కాన్పుల గదిని, ల్యాబ్‌ను, రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ–జెఎస్‌వై పోర్టల్ (జననీ సురక్ష యోజన) పథకం కింద అర్హులందరికీ సంబంధిత పత్రాలు ఇ–జెఎస్‌వై పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన కార్డులను అర్హులకు అందించాలన్నారు. ఫీవర్ సర్వేలో జ్వర లక్షణాలు ఉన్నట్లయితే కరోనా పరీక్షలు నిర్వహించి చికిత్స చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్‌సీడీ సర్వే వీలైనంత త్వరగా పూర్తి చేసి, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమానికి సంబంధించిన సూక్ష్మ ప్రణాళికను తయారు చేసి పంపాలన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు ఆనంద్‌రావు, నవీన్, ఎంపీహెచ్‌ఓ సుబ్బారాయుడు పాల్గొన్నారు.

రమణీయం వేంకటేశ్వరుని రథోత్సవం



జనసందోహం మధ్య సాగుతున్న స్వాముల వారి రథోత్సవం

ఓర్వకల్లు: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం గురువారం రమణీయంగా సాగింది. స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి హాజరై స్వామి వారికి పూజలు నిర్వహించారు. అంతకుముందు ఉత్సవ మూర్తులను అర్చకులు నూతన పట్టు వస్త్రాలతో ముస్తాబు చేసి పల్లకీలో ఆశీనులను చేసి, మంగళవాయిద్యాలు, డప్పుల మధ్య కొండపై నుంచి రేగింపుగా రథశాల వద్దకు తీసుకువచ్చారు. రథానికి కుష్మాండ కాండ, రథాంగబలి సమర్పించారు. ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ మధుమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాముల వారి రథోత్సవాన్ని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆలయ అర్చకులు శేఖర్‌శర్మ రథానికి పూజలు నిర్వహించి ముందుకు కదిలించారు. భక్తుల గోవింద నామస్మరణతో పురవీధులు మార్మోగాయి. అశేష జనసమూహం మధ్య తరలిపోతున్న రథంపైకి పూలు, పండ్లు విసురుతూ భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక సుంకుల పరమేశ్వరి గుడి వద్దకు లాగి.. తిరిగి రథశాలకు చేర్చారు.

రైతు భరోసాకు 30తో గడువు పూర్తి

గూడూరు రూరల్: వైఎస్సార్ రైతు భరోసాకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30తో గడువు ముగియనునందని వ్యవసాయ అధికారి శ్రీవర్ధన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 10న అర్హుల జాబితాను సిద్ధం చేస్తున్నామని, ఇంకా ఎవరైనా అర్హత కలిగిన వారు ఉంటే వెంటనే ఆర్‌బీకేల్లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెదజల్లుతున్నాయని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 27వ వార్డులోని 69, 70వ సచివాలయాల పరిధిలో ఉన్న అబ్బాస్ నగర్, వెంకటాద్రి నగర్‌లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని తెలియజేస్తూ ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మురుగు కాలువలు, కల్వర్టులు, రోడ్లు నిర్మించాలని స్థానికులు కోరగా ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. అవినీతి రహిత పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరముందని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు, జెడ్పీటీసీ ఎ.ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ హనుమంతురెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, నాయకులు కె.పుల్లారెడ్డి, రంగప్ప, గోపాల్‌రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించాలి

ఓర్వకల్లు: రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక పొదుపు భవనంలో గ్రీన్‌కో సంస్థ నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన పాల్గొన్నారు. సోలార్ పరిశ్రమ స్థాపనకు బ్రాహ్మణపల్లె, తిప్పాయపల్లె, కాల్వ, హుసేనాపురం గ్రామాల పరిధిలో 3,800 ఎకరాలు కావాలని గ్రీన్‌కో సంస్థ ప్రతినిధులు కోరారని తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎకరాకు రూ.7.50 లక్షలు లేదా ఏడాదికి రూ.30 వేల చొప్పున 30 ఏళ్ల లీజు పద్ధతిలో కానీ చెల్లిస్తామనగా రైతులు అభ్యంతరం తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి రైతులకు న్యాయం జరిగినప్పుడే పరిశ్రమల అభివృద్ధికి సహకరిస్తారన్నారు. మరోసారి ఆయా గ్రామాల్లో సభలు నిర్వహించి రైతుల అభిప్రాయాలు సేకరించాలన్నారు. సమావేశంలో ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, ఎంపీడీఓ శివనాగప్రసాద్, గ్రీన్‌కో ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఏపీడీ శ్రీనివాసనాయుడు, సింగిల్ విండో చైర్మన్‌లు చంద్రశేఖర్‌రెడ్డి, నాగతిరుపాలు, శంకర్‌రెడ్డి, జీకే వెంగన్న, చంద్రపెద్దస్వామి, లోటర్ బాషా, బిసి రవికుమార్, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అకాల వర్షాల నష్టంపై మంత్రి దృష్టికి

పాణ్యం: అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలు, తడిసిన ధాన్యంపై వ్యవసాయ మంత్రి దృష్టికి తీసుకెళ్లి రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం గోరుకల్లు గ్రామంలోని పెద్దస్వామికి ప్రత్యేక ఫతేహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం కురిసి వర్షాలకు పలు గ్రామాల్లో పంట నీటమునిగి, కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఈ విషయాన్ని మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఎమ్మెల్యే వంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ ఉసేన్‌సా, ఎంపీటీసీ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్యాలకుర్తి ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

కోడుమూరు: విధుల్లో నిర్లక్ష్యం, ఉపాధి కల్పించడంలో బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్న ప్యాలకుర్తి ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్‌ను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. ఇతను కోడుమూరు ఉపాధి హామీ పథకం కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగుల సహకారంతో బోగస్ మస్టర్లు వేసి సుమారు రూ.10 లక్షల నిధులు స్వాహా చేసినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన ఆధారాలతో సర్పంచ్ మెహరున్‌బీ ఉపాధి హామీ పథకం ప్రాజెక్ట్ డైరెక్టర్(పీడీ)కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ చంద్రశేఖర్ ఫీల్డ్ అసిస్టెంట్‌ను పిలిచి విచారణ చేపట్టగా అసలు విషయం బయటపడింది. అయితే ఈ విషయంలో ఇద్దరు ఉద్యోగులను తప్పించేందుకు ఫీల్డ్ అసిస్టెంట్‌ను మాత్రమే సస్పెండ్ చేసినట్లు చర్చ జరుగుతోంది.

సోషల్ ఆడిట్‌పై హెచ్‌ఎంలకు అవగాహన

కోడుమూరు రూరల్: మన బడి నాడు నేడు, బాల్య వివాహాలు, బడిబయట ఉన్న పిల్లలు, పాఠశాలల్లో ఉన్న సౌకర్యాల గురించి సోషల్ ఆడిట్ యాప్‌లో వివరాలు నమోదు అంశాలపై మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు అవగాహన కల్పించినట్లు ఎంఈఓ అనంతయ్య తెలిపారు. గురువారం స్టేట్ రిసోర్స్ పర్సన్ విజయ్ భాస్కర్ మండలంలోని హెచ్‌ఎంలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారని, హెచ్‌ఎంలకున్న పలు అనుమానాలను నివృత్తి చేశారని ఎంఈఓ తెలిపారు.

చిన్నారులకు గాయాలు

గడివేముల: మండల పరిధిలోని చిందుకూరు–గ్రంధివేముల గ్రామాల మధ్య బైకు అదుపుతప్పి నలుగురికి గాయాలయ్యాయి. బూజునూరు గ్రామానికి చెందిన రామాంజనేయులు సొంతపనుల నిమిత్తం భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి గురువారం నంద్యాలకు వెళ్లారు. పనులు ముగించుకుని సొంత గ్రామానికి తిరిగి వస్తుండగా చిందుకూరు–గ్రంధివేముల మధ్య బైకు అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ఘటనలో చిన్నారులకు తీవ్రగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ట్రాఫిక్ నిబంధనలపై ర్యాలీ



కౌలూరు గ్రామంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

పాణ్యం: శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్ఎస్ విద్యార్థులు మండల పరిధిలోని కౌలూరు గ్రామంలో ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న వాహనల వల్ల ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. రోడ్డు నిబంధనలను పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.

కల్లూరు: విద్యాతోనే మహిళా సాధికారత సాధ్యమని చిన్నటేకూరు పరిధిలోని సీఈఎస్ ఫార్మసీ కళాశాల ఎన్‌ఎస్ఎస్ ఆఫీసర్ వెంకటరామయ్య అన్నారు. నాలుగు రోజులుగా లక్ష్మీపురంలో ఎన్‌ఎస్ఎస్ విద్యార్థులు క్యాంప్ నిర్వహిస్తున్నారు. గురువారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఫలితాల్లో ప్రథమం బీసీ గురుకులం



విజయ సంకేతం చూపుతున్న బీసీ గురుకుల విద్యార్థినులు



టి నందిని, బి రూబీ

పాణ్యం: నంద్యాల జిల్లాలో అత్యధిక ఉత్తీర్ణత సాధించిన కళాశాలగా నెరవాడ మెట్ట వద్ద ఉన్న బీసీ రెసిడెన్షియల్ బాలికల కళాశాల నిలిచింది. మొదటి సంవత్సరంలో 101 మందికిగాను 95 మంది (94.05 శాతం), ద్వితీయ సంవత్సరంలో 95 మందికిగాను 92 మంది (96.84శాతం) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 42 మందిగాను 37 మంది, బైపీసీలో 32మంది గాను 31మంది పాస్ అయ్యారు. సీఈసీలో 27 పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో రిజ్వానా 470గాను 438, బైపీసీలో ధనలక్ష్మి 440గాను 420, సీఈసీలో తులసి 500గాను 469 మార్కులు సాధించారు.

– ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 29 మందిగాను 26 మంది, బైపీసీలో 21గాను 21, సీఈసీలో 24–24, ఎంఈసీలో 21గాను 21 మంది పాసయ్యారు. ఎంపీసీలో ఓ. రాజ్యలక్ష్మి 955, బైపీసీలో ప్రవీణ 966, సీఈసీలో నందిని 879, ఎంఈసీలో ప్రవల్లిక 930 మార్కులు సాధించారు. సిబ్బంది సహకారంతో ఇంటర్‌మీడియెట్ ఫలితాల్లో కళాశాల జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ జయమ్మ తెలిపారు.

పంచలింగాల కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

కర్నూలు (న్యూటౌన్): ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో కర్నూలు మండలం పంచలింగాల కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ ఎం. స్వప్నకుమారి తెలిపారు. తమ కళాశాలకు చెందిన 28 మంది పరీక్ష రాయగా 26 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరంలో అకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్ గ్రూపులో టి నందిని 970 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచినట్లు చెప్పారు. ఎస్ వెంకటేశ్వరి 966, బి ఊహ 959, ఎల్ అఖిల 957, బి మేఘన 955, బి అశ్విని 948 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 19 మంది హాజరవ్వగా 12 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. బి రూబీ 500కు 466 మార్కులు సాధించినట్లు వెల్లడించారు.

ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలి

- కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్



మహిళా పోలీసులకు సూచనలిస్తున్న కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్

కోడుమూరు రూరల్: చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్ సూచించారు. గురువారం కోడుమూరు పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో పెండింగ్ కేసులపై ఆరా తీశారు. గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని, ఏవైనా సమస్యలుంటే వారితో మాట్లాడి స్టేషన్‌కు తీసుకువచ్చి పరిష్కరించుకునేలా చూడాలని సూచించారు. గ్రామాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలపై పోలీస్ అధికారులకు సమాచారం చేరవేయాలన్నారు. పాఠశాలలు, కాలేజీలను సందర్శించి విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కోడుమూరు సీఐ శ్రీధర్, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు ఉన్నారు.